## క్లుప్తంగా

### అన్నసమారాధనకు విశేష స్పందన



గొల్లపేటలో అన్న సమారాధన ప్రారంభిస్తున్న జనసేన నాయకుడు సతీష్‌కుమార్

**మునగపాక:** పాటిపల్లి గొల్లపేటలో గురువారం ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు విశేష స్పందన లభించింది. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఉత్తరాంధ్ర జనసేన ఇన్‌చార్జి సుందరపు సతీష్ కుమార్ ప్రారంభించారు. అధిక భక్తులు తరలి వచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు టెక్కలి పరశురామ్, దొడ్డి శ్రీనివాసరావు, పల్లా సన్యాసిరావు, పల్లా వీరప్పారావు పాల్గొన్నారు.

### సీఐ గణేష్‌కు అభినందనలు

**మునగపాక(అచ్యుతాపురం):** అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన సీఐ నమ్మి గణేష్‌ను బీజేపీ నేతలు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజాన సన్యాసినాయుడు, కె.నాయుడుబాబు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

### సంపద కేంద్రాల ద్వారా ఆదాయం



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో ఉదయశ్రీ

**నాతవరం:** పంచాయతీలకు ఆదాయం లభించే మార్గాలపై అన్వేషించాలని డీఎల్‌డీవో ఉదయశ్రీ అన్నారు. నాతవరం పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో ప్రధాన సమస్యలను పంచాయతీ కార్యదర్శి శ్రీనుని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమావేశమై పలు సూచనలు చేశారు. నాతవరం, మర్రిపాలెం పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాల నిర్వహణవల్ల అదనపు ఆదాయం లభించడంతో పాటు గ్రామాలు శుభ్రంగా ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, పంచాయతీ కార్యదర్శులు శ్రీను, రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

### కొండెక్కిన నిత్యావసర ధరలు

**కశింకోట:** కశింకోట వారపు సంతలో గురువారం నిత్యావసర సరకుల ధరలు కొండెక్కాయి. ఉల్లిపాయ కిలో రూ.60కి విక్రయించారు. టమాటా, బంగాళా దుంప, దొండకాయ, బీట్‌రూట్, క్యారెట్, వంకాయ, బెండకాయ రూ.40, బీరకాయ రూ.50, గోరుచిక్కుడు, చేమదుంప రూ.60, చిక్కుడు, క్యాప్సికం కిలో రూ.80 చొప్పున విక్రయాలు సాగాయి.

### బకాయిల కోసం వెలుగు వీవోఏల ఆందోళన



జీతాలు చెల్లించాలని డీఆర్‌వో దయానిధికి వినతిపత్రం అందిస్తున్న వెలుగు నాయకులు

**అనకాపల్లి:** డ్వాక్రా సంఘాలను ఆర్గనైజ్ చేస్తున్న వెలుగు వీవోఏలకు 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని డ్వాక్రా సంఘాల (సీఐటీయూ)గౌరవాధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు ఆరోపించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం డీఆర్‌వో దయానిధి, డీఆర్‌డీఏ పీడీ చంపావతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా జీవనం సాగిస్తారోనన్న కనీసమైన ఆలోచన కూడా ప్రభుత్వానికి లేకపోవడం దారుణమన్నారు. మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌తో వీవోఏలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సిహెచ్.రూపాదేవి, వీవోఏ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.సూరిబాబు, జిల్లా నాయకులు వై.లక్ష్మి, రాము, పుష్ప, భవాని, దమయంతి, రమణ, పద్మ, సత్యం, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



# గురుభ్యోనమః

- ఘనంగా టీచర్స్ డే
- సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో అవార్డు గ్రహీత లక్ష్మిని సత్కరిస్తున్న ఎంపీపీ మళ్ల

**నక్కపల్లి:** సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, భవిష్యత్‌ను తీర్దిదిద్దే గురువులు ఉపాధ్యాయులేనని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీపాద సత్యదేవశర్మ, నక్కపల్లి ఎంఈవో కుంచం నరేష్, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు అన్నారు. దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం గురు పూజోత్సవాన్ని నక్కపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చినదొడ్డిగల్లులో విశ్రాంత ఉపాధ్యాయుడు సత్యదేవశర్మ, ఎంఈవో నరేష్, ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణను సన్మానించారు. అనంతరం గ్రామానికి చెందిన చందక శ్రీనివాసరావు పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ తల్లి, తండ్రి తర్వాత స్థానం గురువులదేనన్నారు. గురువును పరబ్రహ్మగా భావించి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో పోల్చి వారి గొప్పతనాన్ని కొనియాడారు. ఉద్దండపురం, బోదిగల్లం, నక్కపల్లి, వేంపాడు దేవవరం, గొడిచర్ల తదితర గ్రామాల్లో కూడా టీచర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొల్లం చంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు తోట సత్తిబాబు, హెచ్‌ఎం కవిత, తదితరులు పాల్గొన్నారు.



వాడనర్సాపురంలో సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో గ్రామ పెద్దలు

**పాయకరావుపేట:** పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు ఆర్.వి.రత్నంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్.టి.సీతారామయ్య, టి.వెంకటేశ్వరరావు, వెలుగుల అర్జునరావు, కేశనకుర్తి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

**కోటవురట్ల:** రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో హెచ్‌ఎం నానిమణిమోహన్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవాన్ని నిర్వహించారు. పందూరు ఎంపీపీ స్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మునగపాక(అచ్యుతాపురం):** అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో గురువారం సర్వేపల్లి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రాధాకృష్ణన్ చిత్రపటానికి గ్రంథాలయాధికారి దొడ్డి కోటేశ్వరరావు, పాఠకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

**మునగపాక:** ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రొబ్బి లక్ష్మిని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, తదితరులు సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీడీవో ఎం.మన్మథరావు, ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, ఉపాధ్యాయులు ఎం.వై.రాము, రామ్మోహన్, బేతా శంకర్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

**ఎస్.రాయవరం:** మండలంలో గురు పూజోత్సవం సందర్భంగా పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా గురువులను విద్యార్థులు సత్కరించి ఆశీర్వచనం తీసుకున్నారు. పి.ధర్మవరం పాఠశాలలో ఉపాధ్యాయులు పలు క్రీడలు ఆడి అలరించారు. పలువురు విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో సందడి చేశారు.

**పాయకరావుపేట:** స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థలో టీచర్స్‌డే సందర్భంగా ఉపాధ్యాయులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్‌ప్రకాష్, సంస్థల వివిధ శాఖల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

**రాంబిల్లి(యలమంచిలి):** టీచర్స్ డే సందర్భంగా వాడనార్సాపురంలో ఉపాధ్యాయులను రాంబిల్లి సీఐ నర్సింగరావు, డిప్యూటీ తహసీల్దార్ శేషు, గ్రామ పెద్దలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కారే రామారావు, మాజీ సర్పంచ్ చింతకాయల యర్రయ్య, చోడిపిల్లి తాతారావు, కొవిరి సోమేష్, సూరాడ అప్పలరాజు, చోడిపిల్లి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.



చినదొడ్డిగల్లు పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు



పాయకరావుపేట గ్రంథాలయంలో రిటైర్డ్ టీచర్ రత్నంను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు



పందూరు స్కూల్‌లో రాధాకృష్ణన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



అచ్యుతాపురం గ్రంథాలయంలో సర్వేపల్లి చిత్ర పటానికి అంజలి ఘటిస్తున్న పాఠకులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్



పి.ధర్మవరం పాఠశాలలో క్రీడల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

## ఉత్తమ సేవలకు పురస్కారం



గుర్రాజుపేట యూపీ స్కూల్ హెచ్‌ఎం ధర్మారావును సత్కరిస్తున్న కలెక్టర్, తదితరులు



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న బోదిగల్లం సైన్స్ టీచర్ చోడిశెట్టి సత్యనారాయణ

**ఎస్.రాయవరం/నక్కపల్లి:** గురుపూజోత్సవం రోజున ఉత్తమ ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ అనకాపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఎస్.రాయవరం మండలం గుర్రాజుపేట యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.కె.ఎల్.ఎన్.ధర్మారావు ఉత్తమ ఉపాధ్యాయుడిగా జిల్లా అధికారులు చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

- నక్కపల్లి మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన బోదిగల్లం సైన్స్ టీచర్ చోడిశెట్టి సత్యనారాయణను కలెక్టర్ విజయ్‌కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, డీఈవో ఘనంగా సత్కరించారు.

## మిస్టర్ టీన్ ఇండియాకు ఘన సత్కారం



మిస్టర్ టీన్ ఇండియా విజేత ఆదిత్యనాయుడును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**యలమంచిలి రూరల్:** మోడలింగ్‌లో రాణిస్తూ మిస్టర్ టీన్ ఇండియా–2024 విజేతగా నిలిచిన యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన శానాపతి ఆదిత్య నాయుడిని గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. యలమంచిలిలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు పిట్టా సత్తిబాబు, దూది నర్సింహమూర్తి, సయ్యద్ బీబీ, కిరణ్, తదితరులు దుశ్శాలువతో ఆదిత్యనాయుడిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుగ్రామం నుంచి మోడలింగ్‌లో రాణిస్తూ జాతీయ స్థాయిలో విజేతగా నిలవడం చాలా గొప్ప విషయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లి వెంకట్, కొల్లి త్రినాథరావు, పిల్లా త్రినాథ్, వీసం బంగారి, జోజుబాబు, అంకిరెడ్డి నర్సింగరావు, దాసరి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



బాలికలకు వైద్య పరీక్షలు చేస్తున్న గైనకాలజిస్ట్ డాక్టర్ జ్యోత్స్న



తిమ్మాపురం కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న వైద్యురాలు జయలక్ష్మి

**మునగపాక:** బాలికలు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ జ్యోత్స్న సూచించారు. మండలంలోని పాటిపల్లి కేజీబీవీలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా బాలికలు దృష్టి సారించాలన్నారు. ఆహారపు అలవాట్లను మార్చుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ రాణి, మునగపాక పీహెచ్‌సీ డాక్టర్ ప్రవళిక, సీహెచ్‌వో దేవకాంత, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ విల్లూరి జగన్నాథరావు, ఎంఎల్‌హెచ్‌పీ దుర్గ, ఏఎన్‌ఎంలు పెంటకోట సుజాత, టి.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**ఎస్.రాయవరం:** కిశోర్ బాలికలు అందరూ ఆరోగ్యకరంగా ఉండాలని గైనకాలజిస్ట్ జయలక్ష్మి అన్నారు. లింగరాజుపాలెంలో ఉన్న మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే, తిమ్మాపురం కేజీబీవీలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కిశోర్ బాలికలు పాటించాల్సిన సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్వసిద్ధి, పెనుగొల్లు వైద్యాధికారులు శక్తిప్రియ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక ప్రతిమలను పూజించాలి



వాడ్రాపల్లిలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ నూకరాజు



గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న చిట్టిబాబు, ప్రసాద్

**పాయకరావుపేట:** వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణంలోని హైమా నేత్రాలయం ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. హైమా నేత్రాలయ వైద్యులు పీఎస్‌ఆర్ ప్రసాద్ సమకూర్చిన గణపతి ప్రతిమలను, గణపతి పూజ విధానం పుస్తకాలను భక్తులకు టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అడపా ప్రకాష్, నేత్రాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**మునగపాక:** ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలకు పూజలు చేయాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో గురువారం ఆయన మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన వినాయకులను పూజించాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వినియోగించరాదన్నారు.

### కశింకోటలో భారీ వర్షం

**కశింకోట:** కశింకోటలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం వల్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల పరిషత్ కార్యాలయం, పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో నీరు చేరి రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ బస్ స్టేషన్ బురదమయంగా మారింది. ఈ వర్షం వరి నాట్లుకు బాగా ఉపకరిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఎస్.రాయవరం:** కొరుప్రోలు సబ్ స్టేషన్ నుంచి బంగారమ్మపాలెం వరకు విద్యుత్ లైన్ ఏర్పాటులో భాగంగా మండలంలో సుమారు 10 గ్రామాలకు పైగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడ, గుర్రాజుపేట, ఎల్‌పీఆర్ పేట, కొత్త రేవు పోలవరం, రేవు పోలవరం, బంగారమ్మపాలెం, పెదఉప్పలం, వమ్మవరం, పెనుగొల్లు, పి.ధర్మవరం తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

### ఎన్‌ఆర్‌ఎస్‌టీసీ స్కూళ్లు మంజూరు

**రోలుగుంట:** మండలంలోని అర్ల గిరిజన పంచాయతీ శివారు లోసింగి, పీత్రుగెడ్డ గ్రామాలకు ఎన్‌ఆర్‌ఎస్‌టీసీ సూళ్లు మంజూరైనట్టు ఎంఈవోలు జానుప్రసాద్, పి.జగ్గారావు తెలిపారు. ఈ స్కూళ్లలో విద్యాబోధన చేసేందుకు ఆసక్తి గల డీఎడ్, బీఎడ్ విద్యార్హతలు కలిగిన వారు ఈనెల 7వ తేదీ దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు.

## వరద బాధితుల కోసం విరాళాల సేకరణ





వరద బాధితులకు విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నేతలు



చెక్కులను తహసీల్దార్‌కు అందిస్తున్న మేడేటి శంకర్

**మునగపాక(అచ్యుతాపురం):** విజయవాడ వరద బాధితుల కోసం అచ్యుతాపురంలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము మాట్లాడుతూ గుంటూరు, కృష్ణ, ఎన్‌టీఆర్, బాపట్ల, ఏలూరు జిల్లాల్లో ఇటీవల సంభవించిన వరదల కారణంగా ఎంతో మంది సర్వం కోల్పోయారన్నారు. ప్రభుత్వం ఈ సంఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించి సహాయ, సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కె.సోమునాయుడు, జిల్లా కమిటీ సభ్యులు రాజాన సత్తిబాబు, రాజు, నరసింగరావు, నానాజీ, ప్రభాకర్, తాతబాబు పాల్గొన్నారు.

### సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళం

**నక్కపల్లి:** వరద బాధితుల సహాయార్థం నక్కపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మేడేటి శంకర్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు రూ.10వేలు చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళం అందజేశారు. ఈ మేరకు గురువారం ఈ రెండు చెక్కులను స్థానిక తహసీల్దార్ అంబేద్కర్‌కు అందించారు.

## సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

మండల ప్రత్యేకాధికారి లక్ష్మి



అధికారులకు సూచనలు చేస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మి

**నాతవరం:** మండలంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. తుపాను నష్టాలను శాఖల వారీగా నివేదించాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను సచివాలయాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ చేయడంతో పాటు డ్రైనేజీలను శుభ్రం చేయించాలని చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించాలని, వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఆకస్మికంగా తనిఖీలు చేయాలని చెప్పారు. సచివాలయ ఉద్యోగుల సమయ పాలన విషయంలో ఎంపీడీవో ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష తగదు



అవగాహన కల్పిస్తున్న లింక్ వర్కర్ స్కీం సూపర్‌వైజర్ చందు

**రోలుగుంట:** ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం సూపర్‌వైజర్ చందు తెలిపారు. ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ , జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో కొవ్వూరులో గురువారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. మండల కౌన్సెలర్ మలసాల గణేష్, హెచ్‌ఎం దేముడుబాబు, పీహెచ్‌సీ సిబ్బంది కన్నబాబు, ఎంఎల్‌పీహెచ్ నూకరత్నం, మహిళా సంరక్షణ కార్యదర్శి గొల్లు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.